ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 29.0 కనిష్ఠం: 23.0
ANDHRAJYOTHY



శనివారం 31 ఆగస్టు 2024

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

తెలకపల్లి, ఆగస్టు 30: నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం కమ్మారెడ్డిపల్లికి చెందిన గంగారం శారద(35) ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుటుంబ కలహాలతో శారద భర్త రాజుతో శుక్రవారం గొడవ పడింది. దాంతో ఒంటిపై డీజిల్ పోసుకుని, నిప్పంటించుకున్నది. చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. హైదరాబాద్ తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో కడ్తాల వద్ద మృతి చెందింది. ఆమెకు ఒక బాబు ఉన్నాడు. శారద తమ్ముడు మిద్దె వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

పెద్ద చెరువు సంగతేంటి?


ఎఫ్‌టీఎల్ పరిధి హద్దు రాయి పక్కనే నిర్మించిన బహుళ అంతస్థుల భవనం

- పాలమూరులో అనుమతులు లేకుండా నిర్మించారని ఇళ్లను కూల్చేసిన అధికారులు
- చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో పదుల సంఖ్యలో నిర్మాణాలు
- 96.11 ఎకరాలకుగాను 56 ఎకరాలకు కుంచించుకుపోయిన దుస్థితి
- హద్దురాళ్లు ఏర్పాటు చేసి, చేతులు దులుపుకున్న జిల్లా యంత్రాంగం
- బహుళ అంతస్థుల భవనాలకు బదులు రేకుల షెడ్ల తొలగింపు



ఎఫ్‌టీఎల్ పరిధిలోనే నిర్మించిన దేవాలయం

మహబూబ్‌నగర్, ఆగష్టు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సర్వే నెంబర్ 523లో అనుమతులు లేకుండా ఇళ్లను నిర్మించుకున్నారని గురువారం అర్ధరాత్రి భారీ పోలీసు బందోబస్తుతో సుమారు 70 ఇళ్లను అధికారులు కూల్చేశారు. సూత్రధారులు ఎవరనేది గుర్తించకుండానే కూల్చివేతలు చేపట్టిన అధికారులు.. అప్పటి అక్రమార్కులపై కొరడా ఝళిపించడాన్ని ప్రతీసారి పక్కకు తప్పిస్తున్నారు. అయితే ఇప్పుడు పాలమూరులోని పేదలు చాలామంది అధికారుల ముందు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. పట్టా సర్టిఫికెట్లు ఉన్నా ఇళ్లను కూలగొట్టారని, తమలాంటి పేదల ఇళ్లు సరేనని.. మరి పెద్ద చెరువు సంగతేంటి? అని ప్రశ్నిస్తున్నారు. పెద్ద చెరువులో బడా బాబులు బహుళ అంతస్తుల మేడలు కట్టుకున్నారని, అధికారులు ఇదే సాహసం అక్కడ ఎందుకు ప్రదర్శించడం లేదని మండిపడుతున్నారు. కేవలం పేదలు కట్టుకున్న రేకుల షెడ్లను మాత్రమే కూల్చుతారా? లేక పెద్దలు నిర్మించుకున్న ఇళ్లపై ఇదే తరహా దాడుల ఉంటాయా? అని ప్రశ్నిస్తున్నారు. శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలు చేసుకున్న వారిని కేవలం రాజకీయ అండదండలతో పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల్లో ప్రస్తుతం హైడ్రా జోరు నడుస్తోంది. ఇక్కడ కూడా అలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసి, అర్ధరాత్రి ఎలాంటి నోటీసులు లేకుండా పేదల ఇళ్లు కూల్చినట్లే.. బడాబాబుల బహుళ అంతస్తులు కూల్చాలని కోరుతున్నారు. చెరువులో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆక్రమణలు తొలగించాల్సిందే..

ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం నడుం బిగించి, 523 సర్వే నెంబరులోని ఇళ్లను కూల్చివేసిన అధికారులు.. పెద్ద చెరువులో ఉన్న ఆక్రమణలను కూడా తొలగించాల్సిందేననే డిమాండ్లు బలపడుతున్నాయి. ఇక్కడ ఆక్రమణలను కట్టడి చేయడానికి పర్యాటక ప్రదేశంగా తిర్చిదిద్దే ఏర్పాట్లు చేయగా.. ప్రస్తుతం ఆ పనులు ఆగిపోయాయి. దీంతో ఆక్రమణలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ పెద్ద చెరువులో నీళ్లు ఉంటే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది. పట్టణంలో కొద్ది మీటర్ల లోతునే బోర్లలో నీళ్లు వస్తాయి. అలాగే చెరువు అభివృద్ధి వల్ల పర్యాటక ప్రదేశంగా మారుతుంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఆక్రమణ నిర్మాణాలు తొలగించడం వల్ల విస్తీర్ణం పెరిగి, ఎక్కువ నీటిని నిలుపుకునే అవకాశం ఏర్పడుతుంది. భారీ వరదలు వచ్చినప్పుడు ప్రస్తుతం రామయ్యబౌలి, మైత్రీ నగర్, శివశక్తి నగర్ మధురా నగర్, బీకే రెడ్డి కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. వాటిని అరికట్టవచ్చు. గతంలో 20 అడుగుల మేర నాలాలు ఉండగా.. ఇప్పుడు కనీసం ఐదడుగులు కూడా కనిపించడం లేదు. అలుగులు పారితే నీరు వెళ్లేందుకు దారి లేకుండా నాలాను డ్రైనేజీ మాదిరి చిన్నగా మార్చేశారు. అలాగే కొత్త చెరువు నుంచి నీరు వచ్చే నాలాలు కూడా కుంచించుకుపోయాయి. అధికారులు ముందుగా ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పేదల ఇళ్ల మాదిరిగానే పెద్ద చెరువు అక్రమ నిర్మాణాలపై కొరడ ఝళిపిస్తే అధికార వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఏర్పడనుంది.

హైడ్రా తరహా వ్యవస్థ కావాలి



పాలమూరులోని పెద్ద చెరువు పునరద్ధరణ కోసం మేము చాలా ప్రయత్నాలు చేశాం. ఒకప్పుడు ఎండిపోయిన చెరువును క్రికెట్ స్టేడియంగా మారుద్దామంటే హైకోర్టుకు వెళ్లి, ఆదేశాలు తేవడంతో ఆగిపోయింది. ఆ తర్వాత చెరువులో నీళ్ల కోసం గుంతలు తవ్వించాం. ఒకప్పుడు 400 ఫీట్లు డ్రిల్ చేస్తే నీళ్లు పడేవి. చెరువులో నీరు వచ్చిన తర్వా 100 ఫీట్లకే నీరు వస్తోంది. అలాంటి చెరువును ఆక్రమణలతో తగ్గించేశారు. హైడ్రా తరహా వ్యవస్థ ఏర్పాటు చేసి, ఆక్రమణలు కూల్చేయాలి.

\- డాక్టర్ రమేష్ సరోడే,
చెరువుల సంరక్షణ సమితి, మహబూబ్‌నగర్

విన్నవించినా పట్టింపు లేదు



పెద్ద చెరువు ఒకప్పుడు 96 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఉండేది. ఇప్పుడు 56 ఎకరాలకు కుదించుకుపోయింది. మిగతా 40 ఎకరాల్లో ఆక్రమణలతో నిర్మాణాలు చేపట్టారు. వాటిని ఆపాలని కలెక్టర్లకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నపాలు చేశాం. అధికారులతో సర్వే కూడా చేయించాం. చెరువు లోపల కేటాయింపులు చేస్తే కోర్టుకు వెళ్లి స్టేటస్‌కో తెచ్చాం. అన్యాక్రాంతం అవుతుంటే చూస్తున్నారు. అనుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. సర్వే చేసి ఇన్నాళ్లయినా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదు.

\- డాక్టర్ సోమశేఖర్,
పాలమూరు చెరువుల పరిరక్షణ సమితి

మిగిలింది కొంతే..

మహబూబ్‌నగర్ నడిబొడ్డున ఉన్న పెద్ద చెరువు 1995 వరకు పూర్తిగా ఎండిపోయి ఉండేది. దీంతో దాన్ని క్రికెట్ స్టేడియంగా మార్చాలని అప్పట్లో ఆలోచన చేశారు. దాంతో పాలమూరు చెరువుల పరిరక్షణ సమితి పేరుతో హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యాన్ని దాఖలు చేశారు. ఆ తర్వాత దాన్ని చెరువుగానే ఉంచాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. అక్కడ దాదాపు ఐదేళ్లు చెరువుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గుంతలు తవ్వించగా, నీటి రాక ప్రారంభమైంది. ఇక అప్పటి నుంచి నీటి లభ్యత చాలావరకు పెరిగింది. ఈ చెరువు విస్తీర్ణం దాదాపు 96.11 ఎకరాల వరకు ఉండగా.. ప్రస్తుతం 56 ఎకరాల్లోపునకు కుంచించుకుపోయింది. మిగతా 40 ఎకరాలు ఆక్రమణకు గురైంది. ఈ ఆక్రమణలపై గతంలో పురపాలిక, సాగునీరు, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సంయుక్త సర్వే కూడా నిర్వహించారు. ఈ సర్వేలో ఎఫ్‌టీఎల్‌లో 64 ఆక్రమణలను గుర్తించి, గుర్తుగా సిమెంట్ దిమ్మెలను నిర్మించారు. బఫర్ జోన్‌లోనూ మరో ఏడు ఇళ్లను ఆక్రమంగా నిర్మించినట్లు తేల్చారు. కానీ ఇప్పటివరకు వాటివైపు కన్నెత్తి చూడలేదు. సర్వేలో ఆక్రమణలు తేలినా.. కేవలం బడాబాబులు, రాజకీయ పలుకుబడి ఉన్నవారనే కారణంతోనే అధికారులు మిన్నకుండిపోయారు. అదే 523 సర్వే నెంబర్‌లో 60 గజాల్లో చిన్న రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకున్న దివ్యాంగులు, పేదలపై కర్కశత్వం ప్రదర్శించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండింటిలో అసలు దోషులు అధికారులనేది సుస్పష్టంగా తెలుస్తుండగా.. అందుకు బాధ్యులైన ఏ ఒక్కరిపైనా ఈ రోజు వరకు చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని ఆరోపణలు వస్తున్నాయి.

మందుల్లేవ్

- జనరల్ ఆస్పత్రిలో మాత్రలు, ఇంజక్షన్ల కొరత
- కొన్ని రోజులుగా నిలిచిన సరఫరా
- పలు మందులు కొని రోగులకు అందజేత
- పేరుకుపోయిన బై అండ్ సప్లై పెండింగ్ నిధులు
- అంతా బాగానే ఉందంటున్న అధికారులు




మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఆగస్టు 30: ఉమ్మడి జిల్లా ప్రజలకు సంజీవనిలా ఉన్న మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో మాత్రలు, ఇంజక్షన్ల కొరత నెలకొంది. గత కొన్ని రోజులుగా ప్రభుత్వం నుంచి మందులు, ఇంజక్షన్ల సరఫరా నిలిచిపోవడంతో ఉన్న మందులే సర్దుబాటు చేసి, ఇస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో యాంటిబయాటిక్, ఆపరేషన్లకు సంబంధించిన మందులు కావాలంటే బయట కొన్ని తెచ్చి ఇస్తున్నారు. వాటి బకాయి నిధులు కూడా రూ.లక్షల్లో పెండింగ్‌లో ఉన్నాయి. అయితే మీరు ఇవ్వకపోయినా బయటకు రాసి ఇస్తే తీసుకొస్తామని రోగులు అడుగుతున్నా, రాసి ఇస్తే ఏమవుతుందోనని డాక్టర్లు భయపడుతున్నారు. మందులు లేక, రోగం నయంకాక రోగులు రోజుల తరబడి ఆస్పత్రిలోనే ఉంటున్నారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే.. ఆస్పత్రి అధికారులు మాత్రం అన్ని మందులూ ఉన్నాయి అని చెబుతుండడం గమనార్హం.

మందుగోలీలు, ఇంజక్షన్లకు దిక్కులేదు..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు మించి మందులు, ఇంజక్షన్లు ఎక్కువగా అవసరం అయ్యేవి జనరల్ ఆస్పత్రికే. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఉమ్మడి జిల్లాల నుంచి సైతం రోగులు ఇక్కడికి వస్తున్నారు. ప్రతీ రోజు 1200 నుంచి 1500 వరకు ఓపీతో పాటు దాదాపు 500 మంది వరకు అడ్మిట్ అయ్యే రోగులు ఉంటున్నారు. సాధారణంగా వచ్చే దగ్గు, జలుబు, జ్వరం, వాంతులు, విరేచనాలకు సైతం మాత్రలు లేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా వివిధ ఆపరేషన్లు, ఇన్‌ఫెక్షన్లకు వినియోగించే యాంటిబయాటిక్ ఇంజక్షన్లు కూడా లేని దుస్థితి ఏర్పడింది. ప్యాన్‌టాప్, రాంటిడిన్, కడుపునొప్పి, దగ్గు ట్యాబ్లెట్లు లేవు. తీవ్ర జ్వరానికి వాడే పారాసిటమాల్ 1 గ్రాము, కడుపునొప్పికి వాడే ట్రెమడాల్, వాంతులకు వాడే జోఫర్, గ్యాస్‌కు వాడే పాన్‌టాప్, రాంటిడిన్, ఫిట్స్‌కు వాడే లివిప్రిల్ ఇంజక్షన్‌లతో పాటు ఆంటిబయాటిక్‌కు సంబంధించి జోస్టమ్, అగ్‌మంటిన్, షుగర్ ఇన్సులిన్, 25 డి షుగర్, మెరపెనమ్, హైడ్రోకాట్ ఇంజక్షన్లు సైతం ఆస్పత్రిలో లేవు.




సర్జికల్‌లోనూ అదే దుస్థితి..

సర్జికల్ మందుల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా సెలెన్ పెట్టేందుకు వాడే ఐవి క్యానులా, ఐవి సెట్, సీపాప్ మాస్కులు, సిరంజీలు, యూరిన్ కంటేనర్లు, సూదులు, రక్తనమూనాలు తీసుకునే ట్యూబులు లేవు. ఇవి లేకపోవడం వలన అత్యవసర విభాగంతో పాటు ఐసీయూ విభాగాలు, ఆపరేషన్ థియేటర్లలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇంజక్షన్ ఇవ్వాలంటే సిరంజీలు కూడా లేని దౌర్భాగ్యస్థితిలో జనరల్ ఆస్పత్రి ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.


జనరల్ ఆస్పత్రిలోని ఓపీ ఫార్మసీ విభాగం

పేరుకుపోయిన బకాయిలు..

బై అండ్ సప్లై కింద ప్రతీ రోజు టెండరుదారుల నుంచి మందులు, ఇంజక్షన్లు కొని తెచ్చి రోగులకు ఇస్తున్నారు. అయితే ఇప్పటి వరకు మాత్రలకు సంబంధించి రూ.11 లక్షలు, సర్జికల్ మందులకు సంబంధించి రూ.53 లక్షలు పెండిగ్ బకాయిలు పేరుకుపోయాయి. ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. కనీసం ఆస్పత్రి నిర్వహణ నిధులు కూడా ఇవ్వలేదు. దీంతో ఆస్పత్రికి స్కానింగ్ ద్వారా వచ్చే డబ్బులు, బై అండ్ సప్లై నిధులతో ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు.



అంతా బాగానే ఉంది..

దవాఖానాలో సిరంజీలకు సైతం దిక్కులేని పరిస్థితి నెలకొన్నా.. ఆస్పత్రి అధికారులు మాత్రం అంతా బాగానే ఉందని చెప్పడం గమనార్హం. అంతేకాకుండా మందుల కొరత కొద్దిగానే ఉందని, మందులు అన్ని వస్తున్నాయని చెబుతున్నారు. కానీ ఏయే మందులు, ఇంజక్షన్లు లేవని అడిగితే సమాచారం ఇవ్వడానికి నిరాకరించడం విశేషం. ఇదిలాగే కొనసాగితే ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉంది.

మందులు ఇవ్వరు.. బయటికి రాయరు..

ప్రభుత్వం నుంచి మందుల సరఫరా లేకపోవడంతో ఉన్న మందులతోనే డాక్టర్లు సర్దుబాటు చేస్తున్నారు. కానీ రోగులకు ఉన్న రోగాలకు ఆ మందులు సరిపోవడం లేదు. కనీసం బయటకు రాసిద్దామంటే అలా చేయవద్దని ఖచ్చితమైన ఆదేశాలు ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో రోగి జబ్బు నయం చేయడం ఎలా అని డాక్టర్లు లోలోపల మదనపడుతున్నారు. బయటకు రాసిస్తే తెచ్చుకునేందుకు రోగులు కూడా సిద్ధంగా ఉన్నప్పటికీ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు.

ఇండెంట్‌కు తగ్గ ఇవ్వని మందులు, ఇంజక్షన్లు

ప్రభుత్వం నుంచి మందుల సరఫరా లేకుంటే ఆస్పత్రి అధికారులు బయట కొని తెచ్చివ్వాలనే నిబంధన ఉంది. ఆ మేరకు అవసరమైన యాంటిబయాటిక్, సరఫరా లేని మందులు, ఇంజక్షన్లు కొన్ని తెచ్చి రోగులకు ఇస్తున్నారు. అయినా అవి కూడా సరిపోవడం లేదు. అరకొరగా మందులు తెచ్చి, అన్ని విభాగాలకు పంపిస్తున్నారు. అయితే ఇండెంట్‌కు తగ్గట్లుగా మందులు, ఇంజక్షన్లు ఇవ్వడం లేదు. ఉదాహరణకు అత్యవసర విభాగానికి ఒక సిరంజీ బాక్సు ఇచ్చి, రోజంతా గడపాలని చెబుతున్నారు. ఒక్క రోజుకు 60 నుంచి 70 మంది రోగులు క్యాజువాలిటీకి వస్తుంటారు. అదేవిధంగా 29 మంచాలు ఉంటాయి. ఇచ్చే ఆ 100 సిరంజీలతో రక్తనమూనాలు ఎన్ని తీయాలి? ఇంజక్షన్లు ఎన్ని ఇవ్వాలి? దీనికి అధికారులే సమాధానం చెప్పాలి.

పరిహారం కోసం అడ్డదారులు

- లోయర్ జూరాల భూ సేకరణలో అక్రమాలు
- కొత్తగా వెలిసిన షెడ్లు
- బోర్లు, బావులు లేకున్నా ఉన్నట్లు సృష్టి
- మామూళ్లు తీసుకొని వంతపాడిన అధికారులు


రేకులపల్లిలోని ముంపు భూముల్లో వెలిసిన షెడ్లు (ఫైల్)

గద్వాల, ఆగస్టు 30: జూరాల దిగువ భాగంలో నిర్మించిన లోయర్ జూరాల జల విద్యుత్ కేంద్రం భూ సేకరణకు సంబంధించి అవార్డు చేసి, బిల్లులు చెల్లింపునకు రంగం సిద్ధమైంది. అయితే భూసేకరణలో జరిగిన పొరపాట్లు ప్రస్తుత అధికారులకు తెలియకపోవడంతో అనర్హులకు పరిహారం అందే ప్రమాదం ఉంది. గద్వాల మండలం రేకులపల్లి గ్రామం వద్ద లోయర్ జూరాల జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించారు. విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి నీటి కోసం కృష్ణానదిపై ఆనకట్టను నిర్మించారు. ఈ ఆనకట్ట వల్ల నది ప్రవాహం వెనక్కి వెళ్లి, పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. నదీ ప్రవాహం మూడు లక్షల క్యూసెక్కుల కంటే ఎక్కువ పెరిగితే ఆనకట్టకు రెండు వైపులా వందల ఎకరాల్లో భూములు ముంపునకు గురవుతున్నాయి. దాంతో పంటలు నీట మునిగి, రైతులు నష్టపోతున్నారు. తమకు న్యాయం చేయాలని రైతులు కలెక్టర్, లోయర్ జెన్‌కో కార్యాలయాల ముందు ధర్నాలు చేయడంతో అప్పట్లో తాత్కాలిక ఉపశమనం కింద ఎకరాకు రూ.12 వేల చొప్పున 2015 నుంచి 2018 వరకు పంట నష్ట పరిహారం ఇచ్చారు. కానీ శాశ్వత పరిష్కారం కావాలని రైతులు ఉద్యమించడంతో ఎట్టకేలకు భూ సేకరణకు విద్యుత్ అధికారులు అంగీకరించారు.

301 మీటర్ల వద్ద 68 ఎకరాలు సేకరణ

గతంలో ఆనకట్ట వద్ద 299 మీటర్ల ఎత్తులో నీళ్లు ఉన్నప్పుడు భూసేకరణ చేయగా, ఇప్పుడు 301 మీటర్ల ఎత్తు వద్ద నీటి ప్రవాహం ఉన్నప్పుడు ఏ మేరకు పొలాలు నీట మునుగుతాయో నివేదించాలని రెవెన్యూ అధికారులను విద్యుత్ అధికారులు కోరారు. సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సర్వే చేసి, సర్వే నెంబర్ 226 నుంచి 270 వరకు 120 మంది రైతుల 67.30 ఎకరాల భూమి ముంపునకు గురవుతుందని నివేదించారు. భూ సేకరణ కోసం ఏడాదిన్నర క్రితం సర్వే చేశారు. సర్వేకు ముందు ఆ భూముల్లో ఎలాంటి షెడ్లు లేవు. కానీ సర్వే సమయంలో తాటి దూలాలు, పెంకులతో దాదాపు పది వరకు కొత్త షెడ్లు వేశారు. వాటిని గొర్రెలు, బర్రెల పెంపకాల కోసం వేసుకున్నట్లు చిత్రీకరించారు. డబ్బులు దండుకునేందుకు వేసిన వాటికి.. పెద్ద ఎత్తున చేతులు తడపడంతో రెవెన్యూ సర్వే అధికారులు ఒకే చెప్పారు. అక్కడ ఆరు షెడ్లు ఇప్పటికీ ఉన్నాయి. ఒక్కో షెడ్డుకు దాదాపు రూ.ఐదు లక్షలకుపైగా పరిహారం పొందేందుకు బిల్లులు సిద్ధం అయ్యాయి. ఇవే కాకుండా లేని చెట్లు ఉన్నట్లు, ఉన్న చెట్ల సంఖ్యను పెంచి చూపించారు. బోరు బావులు కూడా లేనివి ఉన్నట్లు చూపించారు. ఈ విషయంలో చేతులు తడిపిన వారికే పెద్దపీట వేశారనే ఆరోపణలు ఉన్నాయి.

కలెక్టర్ ఆదేశం మేరకు చెల్లిస్తున్నాం..

కలెక్టర్ ఆదేశం మేరకు బిల్లుల చెల్లింపునకు ఏర్పాట్లు చేశాము. గతంలో సర్వే చేసిన అధికారుల రిపోర్టుల ఆధారంగా బిల్లులు చేస్తాం. ఈ బిల్లుల్లో కొన్ని షెడ్లు కూడా ఉన్నాయి. అయితే అవి ఎలా వెలిశాయి? అనే విషయం నాకు తెలియదు. పరిహారం కోసం వెలిసి ఉంటే పరిశీలిస్తాం.

\- రామ్‌చందర్, ఆర్డీవో
గద్వాల

ఆర్డీవో ఖాతాలో రూ.4.32 కోట్లు

భూముల రైతులకు పరిహారం చెల్లించేందుకు రూ.ఆరు కోట్లు అవసరం వుతాయని లోయర్ జూరాల జల విద్యుత్ అధికారులు అంచనా వేశారు. మొదటి విడతగా రూ.4.32 కోట్లను ఆర్డీవో ఖాతాలో గత ఫిబ్రవరిలో జమ చేశారు. పార్లమెంటు ఎన్నికలు రావడంతో డబ్బుల పంపిణీ వాయిదా పడింది. పది రోజుల క్రితం రైతులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకోవడంతో ఆయన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశం మేరకు పరిహారం చెల్లింపుల కోసం ఆర్డీవో అవార్డులు సిద్ధం చేస్తున్నారు. మూడు రోజుల్లో డబ్బులు చెల్లించే అవకాశం ఉంది. అయితే మరోసారి పరిశీలన చేసి, చెల్లింపులు చేయాలని, పరిహారం కోసమే వెలిసిన షెడ్లకు, చెట్లకు బావులకు డబ్బులు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

అలంపూర్ ఎస్‌ఐపై లైంగిక ఆరోపణలు

- కానిస్టేబుల్ భార్యకు వేధింపులు

గద్వాల క్రైం, ఆగస్టు 30: సమాజానికి ఆదర్శంగా ఉంటూ, బాధితులకు బాసటగా నిలవాల్సిన ఓ పోలీసు అధికారి.. ఓ కానిస్టేబుల్ భార్యను లైంగికంగా వేధించిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో చోటు చేసుకుంది. బాధితుల బంధువులు, పోలీసుల అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అలంపూర్ ఎస్‌ఐ నాగరాజు ఉద్యోగానికి ముందు కోడేరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని చూసేందుకు పెళ్లి చూపులకు వెళ్లాడు. సంబంధం కుదరలేదు. కొన్నేళ్ల తర్వాత నాగరాజుకు ఎస్‌ఐ ఉద్యోగం వచ్చింది. డ్యూటీలో ఉండగా జడ్చర్లలో ప్లాటు విషయంలో సదరు యువతి అక్కతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. భర్తను కోల్పోయిన ఆమె గద్వాల పట్టణంలోని ఓ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగం చేస్తుండేది. 2018లో అప్పటికే ఓ కానిస్టేబుల్‌తో పెళ్లయిన తన చెల్లెలిని సదరు మహిళ ఎస్‌ఐకి పరిచయం చేసింది. ఈ పరిచయం చెల్లెలి భర్త అయిన కానిస్టేబుల్ ఇంట్లో తెలియడంతో ఆమె పుట్టింటి మేనమామలు సదరు ఎస్‌ఐని మందలించి, బుద్ధి చెప్పారు. ఆ తర్వాత సవ్యంగా సాగుతున్న చెల్లెలు సంసారంలో మళ్లీ అక్కే నిప్పులు పోసింది. ఎస్‌ఐ అడగడంతో.. ఇటీవల చెల్లెలి కొడుకు పుట్టిన రోజు వేడుకలకు వచ్చిన అక్క, చెల్లెలి ఇంకో కొడుకు మొబైల్ ద్వారా సదరు ఎస్‌ఐకి చెల్లెలితో వాట్సాప్ కాల్ చేయించింది. ఆ విషయం చెల్లెలి భర్తకు తెలియడంతో మళ్లీ కుటుంబ కలహాలు మొదలయ్యాయి. చెల్లెల్లి మేనమామలు వచ్చి ఇదే విషయంపై సదరు ఎస్‌ఐ పని చేస్తున్న స్టేషన్‌కు వెళ్లి నిలదీసినట్లు సమాచారం. ఆ సమయంలో ఉన్నతాధికారి కూడా ఉన్నారని, ఆ ఉన్నతాధికారి సర్ది చెప్పాడని సమాచారం. ఎస్‌ఐ ఈ ఘటనను మనసులో పెట్టుకుని అక్కకు నూరిపోసి, చెల్లెలితో కోడేరు పోలీస్ స్టేషన్‌లో లేనిపోని ఆరోపణలు చేస్తూ ఆమె భర్త కానిస్టేబుల్‌పై కేసులు పెట్టించాడన్న ఆరోపణలు ఉన్నాయి. అక్కతో కూడా గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించాడని తెలిసింది. తన కాపురంలో చిచ్చు పెట్టడమే గాక, తనపై కేసులు పెట్టించాడని ఇటీవల సదరు కానిస్టేబుల్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయమై జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో కానిస్టేబుల్ వాంగ్మూలాన్ని ఓ హెడ్‌కానిస్టేబుల్ తీసుకున్నట్లు సమాచారం. విషయం వెలుగులోకి రావడంతో కానిస్టేబుల్ భార్య మేనమామ సదరు ఎస్‌ఐపై తీవ్ర ఆరోపణలు చేశాడని తెలిసింది. ఓ ప్లాటు విషయంలో సాయం చేస్తానని వెంటపడి, అక్కతో, ఆమె ద్వారా చెల్లెలి ఫోను నెంబరు తీసుకుని పరిచయం చేసుకున్నాడని, ఈ విషయం తెలిసి 2018లో ఒకసారి ఎస్‌ఐని మందలించారని సమాచారం. నలుగురు పిల్లలతో సంతోషంగా సాగుతున్న కాపురంలో పెద్ద కోడలుతో ఉన్న వివాహేతర సంబంధం వల్ల నాలుగేళ్ల తర్వాత చెల్లెలిని కూడా లోబరుచుకునేందుకు ప్రయత్నించాడని అతను ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయమై సీఐ రవిబాబును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఎస్‌ఐపై వచ్చిన వార్తలు అవాస్తవాలని అన్నారు. సదరు కానిస్టేబుల్‌పై గతంలో రెండు కేసులు నమోదు కావడంతో ఇలా ఆరోపణలు చేస్తున్నాడని, విచారించి నిజాలు ఉంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్‌ఐ నాగరాజును వివరణ కోరగా ఓ కానిస్టేబుల్ భార్యను తాను లైంగిక వేధింపులకు గురి చేసినట్లు సదరు కానిస్టేబుల్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన ఆ కానిస్టేబుల్‌పై వారి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వాగులో కొట్టుకుపోయిన మహిళ మృతి

పాన్‌గల్, ఆగస్టు 30: వాగులో కొట్టుకుపోయిన మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండలంలోని చిక్కేపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిక్కేపల్లికి చెందిన అలివేలమ్మ(65) శుక్రవారం ఉదయం వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుండగా సమీపంలోని అయ్యన్న మొత్త దగ్గర వాగు దాటుతుండగా కొట్టుకు పోయింది. కొద్ది దూరంలోనే మృతదేహం చెట్టుకు తట్టుకొని ఉన్నది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అలివేలమ్మ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు బైకులు ఢీ, ముగ్గురికి గాయాలు

రేవల్లి, ఆగస్టు 30 : రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని ముగురు గాయపడిన సంఘటన శుక్రవారం మండలంలోని చెన్నారం గ్రామ సమీపంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తిరుమలాపూర్‌కు చెందిన రాజు తన భార్యతో కలిసి బైక్‌పై గోపాల్ పేట వెళ్తున్నారు. చంద్రకళ్ గ్రామానికి చెందిన బాల నారాయణ ఎదురుగా వచ్చి ఢీ కొట్టాడు. దీంతో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ముగిసిన ఉద్యోగుల స్నేహపూర్వక క్రీడలు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 30: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడా మైదానంలో నిర్వహించిన ఉద్యోగుల స్నేహ పూర్వక క్రీడలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ క్రీడల్లో పురుషుల విభాగంలో వాలీబాల్‌లో పోలీస్ శాఖ జట్టు విజేతగా నిలువగా విద్యాశాఖ జట్టు రన్నర్‌గా నిలిచింది. క్రికెట్ ఆటలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ జట్టు విజేతగా నిలువగా పోలీస్ డిపార్ట్‌మెంట్ రన్నర్‌గా నిలిచింది. టగ్ ఆఫ్ వార్ ఆటలో పోలీస్ శాఖ జట్టు విజేతగా నిలువగా విద్యాశాఖ జట్టు రన్నర్‌గా నిలిచింది చెస్ పోటీల్లో పోలీస్ శాఖ ఉద్యోగి తారక్ విజేతగా ఉండగా వెటర్నరీ అధికారి సంజీవ రన్నర్‌గా నిలిచారు. మహిళా ఉద్యోగుల విభాగంలో టగ్ ఆఫ్ వార్ క్రీడ విజేతగా జిల్లా ఎస్పీ డెవలప్‌మెంట్ కార్యాలయం జట్టు నిలువగా రన్నర్‌గా జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ జట్టు నిలిచింది. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్ బ్రహ్మయ్యచారి ఉద్యోగులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఏడాది జైలు శిక్ష

వనపర్తి రూరల్, ఆగస్టు 30: దొంగతనం కేసులో నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష రూ.200 జరిమానా వేసినట్లు ఎస్పీ గిరిధర్ తెలిపారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామానికి చెందిన మండ్ల ఎల్లమ్మ తన ఇంటి ముందు నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన పానుగంటి రాములు మధ్య రాత్రి ఆమె సంచిలో నుంచి రూ.2000 దొంగిలించాడని ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేశారు. ఈ కేసు వనపర్తి కోర్టులో నడుస్తున్నది. శుక్రవారం నేరం రుజువు కావడంతో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత నేరస్తుడికి ఏడాది పాటు జైలు శిక్ష రూ.200 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

జూరాల కాలువలో పడి యువకుడి గల్లంతు

పెబ్బేరు రూరల్, ఆగస్టు 30: జూరాల కాలువలో పడి యువకుడు గల్లంతైన సంఘటన శుక్రవారం తోమాలపల్లి వద్ద చోటుచేసుకున్నది. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి ఇద్దరు స్నేహితులు ఆంధ్రప్రదేశ్‌లోని ఆదోనికి బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో పెబ్బేరు మండలం తోమాలపల్లి జూరాల కాలువ వద్ద బైకు ఆపి సోమశేఖర్ బహిర్భూమికి వెళ్లాడు. అతని స్నేహితుడు ఆనంద్‌కుమార్ జాదవ్(35)రోడ్డు పక్కలో ఉన్న కాలువలో స్నానం చేయడానికి వెళ్లి కాలు జారి కాలువలో పడిపోయాడు. కొట్టుకుపోతున్న ఆనంద్‌కుమార్‌ను రక్షించాలని సోమశేఖర్ చేసిన ప్రయత్నం విఫలమైంది. అంతలోనే కాల్వ నీటిలో మునిగిపోయాడు. ఈ విషయంపై సోమశేఖర్ ఫిర్యాదు మేరకు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు.

వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో రాష్ట్ర స్థాయికి విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, డీఈవో

నారాయణపేట, ఆగస్టు 30 : శ్రీత్రిదండి చిన్నజీయర్‌స్వామి ఆదేశాలతో ప్రజ్ఞావికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో నారాయణపేట శ్రీహంసవాహిని పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వ్యాసరచన పోటీలో అమిన్‌పూర్ పాఠశాల విద్యార్థిని దీపిక ప్రథమ, వత్తుగండ్ల విద్యార్థి నితిన్ ద్వితీయ స్థానం, చిత్రలేఖన పోటీలో ప్రథమ స్థానం భైరంకొండ విద్యార్థి ఎల్లప్ప గెలుపొందారు. విద్యార్థులను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, డీఈవో అబ్దుల్‌ఘనిలు శాలువాతో సత్కరించి, మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు సామాజిక అంశాలు తెలియజేయాలని, సాంస్కృతిక పోటీల్లో భాగస్వాములను చేయాలన్నారు. ప్రతీ విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. విద్యార్థులను తరగతి గదికే పరిమితం చేయకుండా క్రీడా పోటీలకు ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గందే అనసూయ, వైస్ చైర్మన్ హరినారాయణభట్టడ్, కౌన్సిలర్ ఎండీ.సలీం, మాజీ ఎంపీపీ సదాశివారెడ్డి, మునిసిపల్ కమిషనర్ సునిత, డీఈవో కార్యాలయ అధికారులు శ్రీనివాస్, నాగార్జునరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రాజేష్, ఉపాధ్యాయులు సుజాత, నమ్రత తదితరులున్నారు.

రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలకు మక్తల్ విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన బాల, బాలికలు

మక్తల్, ఆగస్టు 30 : తెలంగాణ రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈటెల రాజేందర్, ప్రధాన కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రావు ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దీప ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని సాయిజ్యోతి ఉన్నత పాఠశాల మైదానంలో నారాయణపేట జిల్లా స్థాయి బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. పోటీలను పేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, విశ్రాంత పీఈటీ గోపాలం, సాయిజ్యోతి పాఠశాల చైర్మన్ నర్సిములు పాల్గొని ప్రారంభించారు. పోటీల్లో నారాయణపేట జిల్లా నుంచి వంద మంది బాలబాలికలు పాల్గొనగా రాష్ట్ర సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీలకు నారాయణపేట నియోజకవర్గం ధన్వాడ మండలానికి చెందిన బిందు, భావన, కీర్తన, మక్తల్‌కు చెందిన కీర్తి, అశ్విని, శ్రావణ్, శంకర్(ధన్వాడ), అజయ్‌కుమార్, శ్రీనివాస్, కార్తికేయ(మక్తల్)కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు టెన్నికాయిట్ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి దీప తెలిపారు. విద్యార్థులు సెప్టెంబర్ ఒకటి నుంచి మూడో తేదీ వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన బాలబాలికలను మెమెంటో, మెడల్స్‌తో సన్మానించారు. కార్యక్రమంలో వెంకటయ్య, నర్సిములు, గోపాల్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, పీఈటీలు తులిసాదస్, అంబ్రేష్, రమేష్‌కుమార్, దామోదర్, రాకేష్, అంజనేయులు, రాములు పాల్గొన్నారు.

‘మెస్ చార్జీలు పెంచాలి’

జడ్చర్ల, ఆగస్టు 30 : సాంఘిక, సంక్షేమ వసతిగృహాలలో విద్యార్థులకు మెస్, కాస్మెటిక్ చార్జీలను పెంచాలని, మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ వసతిగృహ విద్యార్థులు శుక్రవారం జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. మెస్‌చార్జీలు పెంచకపోవడంతో నాసిరకం భోజనం తినవలసి వస్తున్నదని, పెరుగుతున్న ధరలకనుగుణంగా మెస్‌చార్జీలను పెంచాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యం, రాష్ట్ర కమిటీ సభ్యురాలు లక్ష్మీదేవి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు జగన్, సీఐటియు జిల్లా సహాయకార్యదర్శి తెలుగుసత్తయ్య, సభ్యులు మనోహర్‌తో పాటు వసతిగృహ విద్యార్థులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినం



మాట్లాడుతున్న టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు జి.రాజీవ్‌రెడ్డి

పాలమూరు, ఆగస్టు 30 : సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున నిరసన ప్రదర్శన చేపడుతున్నట్లు టీజీఈ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో ఏర్పాటు చేసిన జేఏసీ సమావేశంలో జేఏసీ నాయకులు జి.రాజీవ్‌రెడ్డి,ఆర్.చంద్రానాయక్,ఎన్.వెంకటేష్, చంద్రకాంత్‌లు మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ సమితి జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన చేపడుతున్నట్లు తెలిపారు. నిరసన ప్రదర్శనలో జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు అందరు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాంట్రీబ్యూటరీ పెన్షన్ విధానం వల్ల 2004తరువాత నియామకమైన ఉద్యోగులకు పెన్షన్ రాక తీవ్ర మనోవేదనలో ఉన్నారని తెలిపారు. సమావేశంలో యూటీఎఫ్ ఎన్.వెంకటేష్,కె.రవికుమార్, ఎస్టీయూ వెంకటేష్, డీటీఎఫ్ ఆదిత్య, సీపీఎస్ నాయకులు చంద్రకాంత్, టీటీయూ జుర్రు నారాయణ, యాదయ్య, మహమూద్, సాయిలుగౌడ్, శ్రీరాములు, చెన్నయ్య, నరేందర్ పాల్గొన్నారు

మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బెక్కరి అనిత

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



బెక్కరి అనిత

మహబూబ్‌నగర్, ఆగస్టు 30 : మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మాజీఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి కూతురు బెక్కరి అనితమధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం ప్రభుత్వ కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. ఈమెతో పాటు వైస్‌చైర్మన్‌గా గడుగు విజయ్‌కుమార్‌తోపాటు మరో 12 మంది మెంబర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా బెక్కరి అనిత గుర్తింపు పొందారు. ఇదివరకు మహిళాకాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా పనిచేశారు. డీసీసీ అధికారప్రతినిధిగా కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్రపోషించారు. ఆమె సేవలకు గుర్తింపుగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మార్కెట్‌చైర్మన్‌గా ఆమె నియామకానికి కృషిచేశారు. అదేవిధంగా 12 మంది మెంబర్లను నియమించారు. వీరిలో యెర్రసాయనోళ్ళ అచ్చన్న, యెన్నపోతుల భగవంతు, సయ్యద్‌మసూద్, కంచిమ్‌పల్లి బాలకిష్టయ్య, నంబి వెంకటాద్రి, జరుపుల శంకర్‌నాయక్, రావుల పెద్దనర్సింహులు, కావలి రామకృష్ణ, గౌర్దాయపల్లిరామస్వామి, గుడిబండ లక్ష్మీనర్సమ్మ, గుబ్బరాఘవేంద్రస్వామి, రాగిరి తిరుపతయ్యలు ఉన్నారు. వీరితోపాటు మహబూబ్‌నగర్ రూరల్ పీఏసీఎస్‌చైర్మన్, మహబూబ్‌నగర్ జిల్లా మార్కెటింగ్ అధికారి, అగ్రికల్చర్ ఏడి, మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్‌లు మెంబర్లుగా ఉంటారు.

4.6 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 30 : కల్వకుర్తి పట్టణంలోని కిరాణ దుకాణంలో అక్రమంగా నిలవచేసిన 4.6 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సివిల్‌సప్లై ఎన్‌ఫోర్సుమెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాఘవేందర్‌రెడ్డి, కల్వకుర్తి రెండో ఎస్ఐ రాంచంద్రజీ కలిసి నమ్మదగిన సమాచారం మేరకు పట్టణంలోని శివాజీ చౌరస్తాలో ఉన్న అజాస్ దుకాణంలో కొంతమంది వద్ద కొన్న పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచారని తెలిసింది. తనిఖీలు నిర్వహించగా దుకాణంలో 4.6 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇదే ఆ..ధారం

- రెక్కాడితే కాని డొక్కాడదు
- ఆగిన మగ్గం, సాగని బతుకులు
- మగ్గం గుంతలో మురుగునీటి ఊట
- గతిలేక గత్యంతరం లేని బతుకులు
- అధికారులు నోటీసులు ఇచ్చినా గూడు వదలలేని దుస్థితి

అయిజ, ఆగస్టు 30 : సామాన్యులకు రెక్కాడితే కాని డొక్కాడదు. కాయకష్టం చేస్తేనే పుట గడువని పరిస్థితి. ఇంట్లోకి నీళ్ల వచ్చినా, గూడు నేల కూలిన కాసింత మూలన చోటు చూసుకుని తలదాచుకునే దైన్యస్థితి. మొన్న గోడకూలి పసిపాప శ్రీకృతి ప్రాణాలు వదిలింది. పాప ఇంటి ముందే పెద్ద మురుగునీటి కుంట ఉంది. నీరు ముందుకు వెళ్లేందుకు దారి లేదు. అక్కడ నివాసం ఉంటున్న పేదల ఇళ్ల లోతట్టులో ఉన్నాయి. వర్షం నీరు, మురుగు నీరు ఇళ్లలోకి వెళ్లటమే కాకుండా వారి ఇళ్లల్లో నీరు చేరుతోంది. గోడలు నీటి తంపుతో మరో 36 గుడిసెలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతోంది. అయిజ మునిసిపాలిటీలో 176 ఇళ్ల కూలేందుకు సిద్ధంగా ఉండటంతో వారికి అధికారులు నోటీసులు జారీ చేశారు. 14వ వార్డు కొత్తపేట కాలనీలో ఈ దుస్థితి నెలకొంది. ఇక్కడ నివాసం ఉంటున్న ఒక్కొక్కరిది ఒక్కొక్క దయనీయ స్థితి.

ఆగిన మగ్గం - సాగని బతుకు

కొత్తపేట కాలనీలో గత 20 ఏళ్లుగా గుడిసె వేసుకుని తన భార్యతో కలిసి నేస నారాయణ కాపురం ఉంటున్నాడు. తన వృత్తి అయిన మగ్గం నేస్తూ జీవనోపాధి సాగిస్తున్నాడు. భారీ వర్షాలు కురవటంతో ప్రక్కనే మురుగునీటి కుంట ఉండటం, మగ్గం కోసం ఇంటి మధ్యలో గోయ్యితవ్వి ఉండటంతో అందులో మురికి నీటి ఊట చేరుతోంది. దీనితో తన కుటుంబానికి జీవనాధారం అయిన మగ్గాన్ని మూలన



పెట్టాల్సి వచ్చింది. దీనితో కుటుంబ పోషణ భారంగా మారింది. కుల వృత్తి తప్ప మరొక్కటి రాదు. దీనితో ఏమి చేయలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

- నేస నారాయణ, చేనేత కార్మికుడు

రెక్కాడితే కాని డొక్కాడని బతుకులు



వర్షం కురిసిన ప్రతీ సారి మా ఇంట్లోకి నేరుగా నీరు వస్తోంది. వాటిని తోడి పోయాలి. వర్షం కురుస్తుంది అంటే మాకు నిద్రలేని రాత్రులే. నా భర్త మూడు సంవత్సరాల క్రితం చనిపోయాడు. ఒంటరి మహిళ అయిన నేను నా ముగ్గురు కూతుళ్లతో జీవనం సాగిస్తున్నాను. అధికారులు ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారు. ఇది తప్ప మాకు ఎక్కడ లేదు. ప్రతీ రోజు ఏదో కూలిపనికి వెళ్తే తప్ప జీవనం గడవని స్థితి. మాలాంటి వారికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తే తప్ప ముందుకు అడుగు వేయలేని నిస్సాహాయులం.

- మౌలానాబి, ఒంటరి మహిళ

మాకు గత్యంతరం లేదు

ఇది తప్ప వేరే గత్యంతరం లేకనే కూలటానికి సిద్ధంగా ఉన్న పూరిగుడిసెలోనే ఉంటున్నాం. నేడో రేపో అని మాకు తెలుసు అయినా తప్పటం లేదు. అధికారులు ఎన్ని నోటీసులు ఇచ్చిన వేరే ఎక్కడ వెళ్లలేము. ఇక్కడే జీవ సమాధి కావటం తప్ప చేసేది ఏమి లేదు. పూట గడవటమే కష్టంగా ఉన్న బతుకులు మావి. ఈ గుడిసె వదిలి ఎక్కడికి వెళ్లలేము. గుడిసె కూలి పోతుందని మాకు తెలుసు అయిన తప్పటం లేదు. ప్రతీరోజు బిక్కు బిక్కుమం టూ కాలం వెళ్లదీయాల్సిందే తప్ప ఏమి చేయలేని స్థితిలో మేమున్నాము.

- వృద్ధుడు, కుర్వ నర్సింహులు



నేలకూలిన ఇంటిలో తెరచాటు నివాసం



నోటీసులు ఇచ్చి అప్రమత్తం చేశాం

అయిజ మునిసిపాలిటీ పరిధిలోని కొత్తపేట వీధిలో కూలటానికి సిద్ధంగా ఉన్న, కూలిన 176 ఇళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చాం. ఇళ్లలో నివాసం ఉండవద్దని అప్రమత్తం చేశాం. వీలైనంత త్వరగా ఇళ్లను ఖాళీ చేయాలని సూచించాం.

- లక్ష్మారెడ్డి మునిసిపల్ కమిషనర్

శరీరాన్ని తయారు చేసిన వాడు భగవంతుడు

- చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం

జడ్చర్ల, ఆగస్టు 30 : శరీరాన్ని తయారు చేసిన వాడు భగవంతుడని బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. జడ్చర్ల పట్టణంలోని చంద్రా గార్డెన్స్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాదిమి శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ప్రవచనాలు వెల్లడించారు. తల్లి, తండ్రి, గురువులు భగవంతులేనన్నారు. భగవత్ అనుగ్రహం లేకపోతే పంటలు పండవన్నారు. తెల్లవారి లేచిన వెంటనే భగవన్నామస్మరణ చేయాలని సూచించారు. ఈశ్వరునికి కృతజ్ఞత చెప్పుకోవడమే పూజ అని తెలిపారు. పూజ చేయడంతో మనలోనే కృతజ్ఞత వ్యక్తమవుతుందన్నారు. శరీరం ఉన్నప్పుడే అందరూ సేవ చేస్తారన్నారు. శరీరం పోయిన అనంతరం కూడా భగవంతుడు మాత్రమే సేవ చేస్తాడని, ఉపకారం చేస్తాడన్నారు. శ్మశానంలో అందరూ వెళ్లిన తర్వాత కూడా శివుడు అండగా నిలుస్తాడని, భక్తితో చేసేదే పూజ అని వివరించారు. శివకేశవుల మధ్య బేధం పాటించకుండా, ఎవరి కుల దైవాన్ని వారు పూజించాలని సూచించారు. ప్రపంచ దేశాలలో భారతదేశం విశిష్టమైనదని, భారతదేశం ఒక పూజా మందిరమన్నారు. ఎవరైతే మనస్సు పెట్టి పూజిస్తారో వారికి భగవత్ అనుగ్రహం లభిస్తుందన్నారు. డాక్టర్ చాగంటి కోటేశ్వర్‌రావు ప్రవచన కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం సభ్యులు బాదేపల్లి శంకర్‌బాబు, వాసవి నర్సిములు, గోపాలకృష్ణ, మంచన విఠలయ్య, ముటుపూర్ రవీందర్, ఆలంపల్లి మనోహర్, మిర్యాలవేణుగోపాల్, కుమారస్వామి, బుచ్చిలింగం, దత్తుకుమార్, రాంరెడ్డి, జనార్దన్, వెంకటస్వామి, మహేశ్వర్, పద్మలీల, శివరేఖ, బాదిమి రవిశంకర్, పెద్ది పెంటయ్య, పట్టణ వాసులు పాల్గొన్నారు.



జడ్చర్లలో ప్రవచనం చేస్తున్న డాక్టర్ చాగంటి కోటేశ్వర్‌రావు



ప్రజలతో కలిసి సందేశం వింటున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ప్రముఖులు

భూత్పూర్ చౌరస్తాలో 11నెలల బాలుడు లభ్యం

- శిశువిహార్‌లో అప్పగించిన పోలీసులు



బాలుడిని చేరదీసిన భూత్పూర్ పోలీసు

భూత్పూర్, ఆగస్టు 30 : సుమారు 11 తల్లి ఒడిలో వెచ్చగా ఉంటూ.... పాలు తాగి హాయిగా నిద్ర పోవాల్సిన ఓ పసికందు ఇలా రోడ్డు మీదు గుక్కపట్టి ఏడుస్తుంటే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో చేరదీశారు. భూత్పూర్ చౌరస్తాలోని ఓ కిరాణ కొట్టు దగ్గర శుక్రవారం తెల్లవారుజామున ఏడుస్తుండగా గమనించిన మునిసిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు పోలీసులకు సమాచా రం ఇచ్చారు. ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని బాలుణ్ని పరీక్షించి, బాలుడి ఫొటోను సోషల్ మీడియాలో పెట్టి చుట్టుపక్కల గ్రామాల వారికి వాకబు చేసినా ఎవరూ గుర్తించకపోవడంతో ఎస్ఐ బాలుడిని మహబూబ్‌నగర్ శిశువిహార్ కేంద్రంలో అప్పజెప్పారు.

‘ఉద్యమ ఆచరణను ప్రభావితం చేసిన మనిషి కె.కె.’

పాలమూరు, ఆగస్టు 30 : సమసమాజ స్వప్నాలలో మనసామాజిక వృత్తిపర ఉద్యమ ఆచరణను ప్రభావితం చేసిన మనిషి కె.కనకాచారి అని కె.కె మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు యం.రాఘవాచారి, కె.వామన్‌కుమార్, కె.భీమయ్య, నరసయ్యలు అన్నారు. సెప్టెంబరు ఒకటో తేదీన జిల్లా కేంద్రంలోని అరుంధతీ భవన్‌లో కె.కె. స్మారక ఉపన్యాసాలు నిర్వహిస్తున్నట్లు కె.కె మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభకు ముఖ్య అతిథులుగా జహేరా, ఖలీదా పర్వీన్, ప్రొ.జి.హరగోపాల్, ఎస్.వేణుగోపాల్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రజాస్వామిక పరివర్తన కోసం నిరంతరం ఆచరణలో ఉన్న మనిషే కనకాచారి అన్నారు. ఆనాటి ప్రభుత్వం ఆగస్టు 24, 2005న ఆయనను బలితీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యుదయవాదులు, ప్రజాసంఘాల నాయకులు సభకు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

దసరాలోపు అభివృద్ధి పనులు పూర్తి కావాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

వంగూరు, ఆగస్టు 30 : కొండారెడ్డిపల్లి గ్రామానికి అభివృద్ధి కింద మంజూరైన నిధులతో జరుగుతున్న నిర్మాణ పనులు దసరా పండగలోపు పూర్తి కావాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామాన్ని కలెక్టర్ సందర్శించారు. అభివృద్ధి పనులపై కలెక్టర్ సంతోష్ సంబంధిత శాఖ అధికారులతో కలిసి నిర్మాణమవుతున్న ప్రభుత్వ పాఠశాల, గ్రంథాలయం, పాలశీతలీకరణ కేంద్రం, గ్రామపంచాయతీ, బీసీ కమ్యూనిటీ హాల్, పశువైద్యశాల నిర్మాణం పనులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్ల విస్తరణ, అండర్ డ్రైనేజీ నిర్మాణం, శ్రీశైలం హైవే రోడ్డు నుంచి గ్రామం వరకు నాలుగులేన్ల రహదారి, విద్యుద్దీకరణ లాంటి అభివృద్ధి పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా వంగూరు మండల కేంద్రంలో సమీకృత భవన నిర్మాణం, వంగూరు గేటు నుంచి జూపల్లి రోడ్డు విస్తరణ పనులు, సర్వారెడ్డిపల్లి నుంచి కొండారెడ్డిపల్లి మీదుగా డబుల్ రోడ్డు విస్తరణ పనులకు సంబంధించిన ప్రక్రియలను త్వరితగతిన పూర్తయ్యేలా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కొండారెడ్డిపల్లికి దసరా రోజు సీఎం వస్తుండటంతో అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని, అందుకు అనుగుణంగా గ్రామంలో కొనసాగుతున్న నిర్మాణ పనులు అన్నీ పూర్తి చేయాలన్నారు. అంతకు ముందు కలెక్టర్ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు అందుతున్న గుడ్లు, బియ్యాన్ని పరిశీలించారు. గుడ్లు చిన్నపరిమాణంలో ఉండకుండా చూసుకోవాలని సూచించారు. కేంద్రానికి వస్తున్న విద్యార్థుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ రమేష్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీఎస్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వేమారెడ్డి, ఏఈ మణిపాల్‌నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

కాలనీ రహదారిని ఆక్రమిస్తున్నారని ఆందోళన



రోడ్డుకు అడ్డంగా వేసిన కట్టెలు, రాళ్లు

వెల్దండ, ఆగస్టు 30 : కాలనీలోని రహదారిని కొందరు ఆక్రమిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేసిన సంఘటన శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో కొందరు వ్యక్తులు రోడ్డును ఆక్రమిస్తున్నారని, దీంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని అదే కాలనీకి చెందిన వ్యక్తులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీకి చెందిన కొందరు రోడ్డుకు అడ్డంగా కట్టెలు, కడీలు వేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వచ్చి వాటిని తొలగించాలని సూచించారు. గ్రామకార్యదర్శి విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలని సూచించారు. విషయంపై కార్యదర్శి సైదమ్మ స్పందిస్తూ తమకు సంబంధించిన పత్రాలను తీసుకుని రావాలని ఇరువర్గాలకు సూచించారు.

విద్యార్థి దశలోనే ప్రజాస్వామ్య విలువల పట్ల అవగాహన

బిజినేపల్లి, ఆగస్టు 30 : పాఠశాల స్థాయిలో మాక్ పార్లమెంట్ నిర్వహించడం ద్వారా విద్యార్థి దశలోనే పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువల పట్ల, రాజ్యాంగబద్ధ పాలన పట్ల అవగాహన కలుగుతుందని ఎంపీ మల్లు రవి అన్నారు. మండలంలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం 26వ యూత్ పార్లమెంట్ కాంపిటీషన్‌లో భాగంగా మాక్ పార్లమెంటన్‌ను విద్యార్థులను నిర్వహించారు. హాజరైన ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి మాట్లాడారు. దేశంలోని సమస్యల పట్ల పార్లమెంటులో ఎంపీలు సభలో ప్రశ్నించి ప్రభుత్వం నుంచి సమాధానాలు రాబట్టడం, ప్రతిపక్ష నాయకులు ప్రజాపక్షంగా వ్యవహరించే తీరును, అలాగే రాష్ట్రంలో అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష పార్టీల బాధ్యతలు వంటి అంశాలను విద్యార్థి దశలోనే మాక్ పార్లమెంటు ద్వారా ప్రత్యేక అనుభవం కల్గించడం హర్షనీయమన్నారు. రాబోయే రోజుల్లో దేశానికి అవసరమైన ఉత్తమ రాజకీయ నాయకులు తయారు కావడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని కొనియాడారు. రాష్ట్రంలో కేవలం వట్టెం జవహర్ నవోదయతో పాటు మెదక్ నవోదయ విద్యాలయానికి మాత్రమే యూత్ పార్లమెంట్ కాంపిటీషన్ నిర్వహించే అవకాశాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ అవకాశం కల్పించిందని ప్రిన్సిపాల్ భాస్కర్ కుమార్ అన్నారు. గంట పాటు విద్యార్థులు నాయకుల వేషధారణతో నిర్వహించే మాక్ పార్లమెంట్‌ను వీడియో రికార్డు చేసి పార్లమెంట్ వ్యవహారాల శాఖకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జానకి రాములు, మాజీ సర్పంచ్ అమృత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ తిరుపతి రెడ్డి, వెంకటస్వామి, రామకృష్ణ, భగవంత్ గౌడ్, భాస్కరాచారి తదితరులు ఉన్నారు.



వట్టెం నవోదయలో మాక్ పార్లమెంట్‌ను తిలకిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

బండర్‌పల్లి చెక్‌డ్యాంలో వృద్ధురాలి మృతి



కొండమ్మ మృతదేహం

చిన్నచింతకుంట, ఆగస్టు 30 : మండలంలోని బండర్‌పల్లి చెక్ డ్యాంలో పడి వృద్ధురాలు మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... దేవరకద్ర మండలంలోని గూరకొండ గ్రామానికి చెందిన కొండమ్మ (60) ఉదయం 8-30 గంటల సమయంలో ఆ గ్రామ సమీపాన, చిన్నచింతకుంట మండల పరిధిలోని బండర్‌పల్లి గ్రామ శివారులోని చెక్‌డ్యాంలో శవమైతేలింది. దాంతో విషయం తెలుసుకున్న స్థానికులు వారి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలికి మతిస్థిమితం లేదని తెలిసింది. చెక్‌డ్యాం సమీపంలోని నీటిలో ప్రమాదవశాత్తు పడిఉంటుందని గ్రామస్థులు తెలిపారు. దీనిపై మృతురాలు కుటుంబీకులు తమకు ఎలాంటి పిర్యాదు ఇవ్వలేదని ఎస్ఐ శేఖర్ తెలిపారు.మృతురాలికి ఇద్దరు కొడుకులు,ముగ్గురు కూతుళ్ళు ఉన్నారని తెలిసింది.

చాగదోణలో వేప చెట్టుకు కల్లు ధార..

- వింతగా గమనిస్తున్న గ్రామస్థులు

గట్టు, ఆగస్టు 30: మండల పరిధిలోని చాగదోణ గ్రామంలో వేప చెట్టుకు తెల్లటి వేప కల్లు కారడం చర్చానీయాంశం మారింది. గ్రామంలోని ఒరుగు నాగేశ్ చొప్ప దొడ్డిలో ఉన్న వేప చెట్టుకు శుక్రవారం ధారగా తెల్లటి ద్రవం (వేప కల్లు) కారుతుండటంతో గ్రామస్థులు ఆ ప్రాంతానికి వెళ్లి చెట్టును ఆసక్తిగా గమనించారు. దీంతో గ్రామానికి చెందిన గౌడ సామాజిక వర్గం వారు చెట్టు దగ్గరకు వెళ్లి కుండను కట్టి కల్లును పట్టారు. అనంతరం పూజలు చేసి టెంకాయలు కొట్టారు. అయితే బ్రహ్మంగారు కాలజ్ఞానంలో చెప్పారని, ప్రస్తుతం అలాగే జరుగుతుందని గ్రామస్థులు చర్చించుకున్నారు. పూజ చేసిన వారిలో మునిచంద్రగౌడ్, జితేందర్‌గౌడ్, పరమేష్‌స్వామి, మాదవయ్య తదితర గ్రామస్థులు ఉన్నారు.

వేప చెట్టుకు కారుతున్న కల్లును గమనిస్తున్న గ్రామస్థులు



బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

- బాధిత కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెద్దమందడి, ఆగస్టు 30: బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. ఈ నెల 28న పామిరెడ్డిపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబ సభ్యులను శుక్రవారం ఆయన పరామర్శించారు. అధైర్య పడొద్దని, కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తక్షణ సహాయంగా ఒక్కో కుటుంబానికి రూ. 25వేలు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వనపర్తి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘుప్రసాద్, గ్రామ పెద్దలు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన జిల్లా అధికారులు

- సన్మానించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి



ఉద్యోగ విరమణ చేసిన అధికారులను సన్మానిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 30: జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీబాయి, టీజీఈడబ్ల్యూఐడీసీ కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాస్ శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు అధికారులను కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం కలెక్టర్ ఆదర్శ్ సురభి , జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు. శాలువా, పూలమాల, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వారి సేవలను కలెక్టర్ కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ నగేష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పని చేసే వారినే అభిమానిస్తరు : డీఈవో

వనపర్తి రూరల్, ఆగస్టు 30: వృత్తి ధర్మాన్ని చిత్త శుద్ధితో నిర్వహిస్తూ విద్యార్థుల కోసం పని చేసే ఉపాధ్యాయులను ప్రజలు ఎప్పటికీ అభిమానిస్తారని డీఈవో గోవిందరాజులు అన్నారు. శుక్రవారం వనపర్తి హరిజనవాడ ఉన్నత పాఠశాలలో జరిగిన సోషల్ స్కూల్ అసిస్టెంట్ బీ సులోచన ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని అన్నారు. 41 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో సులోచన విద్యార్థుల ప్రగతికి చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్ గౌడ్, జిల్లా గెజిటెడ్ హెచ్‌ఎమ్స్ అసోసియేషన్స్ అధ్యక్ష, కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేకాలంకరణలో వాసవీమాత



వెండి తొడుగుతో అమ్మవారు

కొత్తకోట, ఆగస్టు 30 : పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలోని వాసవీ మాత, సహిత లక్ష్మీదేవి, సరస్వతీ దేవతలు శుక్రవారం ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకోని ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో దేవతామూర్తులకు పంచామృతాలతో అభిషేకం చేశారు. అదేవిధంగా 20 కిలోల వెండితో తయారు చేయించిన తొడుగుతో అలంకరించారు. ప్రత్యేక పూజలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గుంత మౌనిక, మండల అధ్యక్షురాలు స్వప్న, ఆర్యవైశ్యులు గుంత సురేష్, సహన, జ్యోతి, వెంకటరమణ, గుంత మల్లేష్, గంగాధర్, బాలకృష్ణ, నరేష్ ప్రసన్నలక్ష్మీ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పుట్ట ఆంజనేయులు

వనపర్తి టౌన్, ఆగస్టు 30: ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచి ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పుట్ట ఆంజనేయులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ సమీపంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో మహిళ ప్రయాణికుల సంఖ్య అమాంతం పెరిగిందని అన్నారు. అందుకు అనుగుణంగా బస్సుల సంఖ్య కూడా పెంచాలన్నారు. హైదరాబాద్ నుంచి వనపర్తికి ఆర్టీసి బస్సులో వచ్చే ప్రయాణికులు నిలబడి రావాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్టీసీ డిపో పర్యవేక్షకుడు కృష్ణయ్యకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, లక్ష్మీ, పరమేశ్వరాచారి, గంధం మదన్, రమేష్, గట్టయ్య నందిమల్ల రాములు, మద్దిలేటి, బీసన్న, మన్నెం, డి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పండుగ సాయన్న విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



పండుగ సాయన్న విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ముదిరాజ్ నాయకులు

ఖిల్లాఘణపురం, ఆగస్టు 30: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో పండుగ సాయన్న విగ్రహం ఏర్పాటుకు శుక్రవారం మత్స్యకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆనిమోని కృష్ణయ్య ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ముదిరాజ్ సంఘం సభ్యుల సహకారంతో పండుగ సాయన్న తొమ్మిది అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం మండల అధ్యక్షుడు సాయిలు, మాజీ సర్పంచులు దేవేందర్, వెంకటయ్య ముదిరాజ్ సంఘం మండల నాయకులు గొడుగు సత్యం, రామచంద్రయ్య, కాగితాల మధు, చెన్నయ్య, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడి ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 30: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక వనపర్తి కమిటీ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఈనెల 26వ తేదీన జిల్లా కేంద్రంలోని బండారు నగర్‌లో ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేసి శ్రీకృష్ణుడి ప్రతిమ ఏర్పాటు చేసి ఐదు రోజుల పాటు పూజలు నిర్వహించారు. ఐదో రోజు శుక్రవారం శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పుర వీధులలో కృష్ణుడి శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక వనపర్తి కమిటీ అధ్యక్షుడు వెంకట్రాములు, సభ్యులు బాలయ్య, బాలకృష్ణ, సురేష్ కుమార్, కృష్ణయ్య, బద్రి నారాయణ, ఆంజనేయులు, విశ్వనాథ్, నాగరత్నం, లలిత, శివమ్మ, పద్మ, స్వరూప, లక్ష్మి, సుష్మిత, సునీత, అలివేల తదితరులు పాల్గొన్నారు.

ఫాగింగ్ ఎందుకు చేయలేదు

- ఎంపీవో, పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్ ఆగ్రహం



నర్సింగాపురంలో డెంగీ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

మదనాపురం, ఆగస్టు 30: గ్రామాల్లో ప్రజలు వ్యాధుల బారిన పడుతుంటే దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయకుండా ఏం చేస్తున్నారని ఎంపీవో హుసేనప్ప, నర్సింగాపూర్ పంచాయతీ కార్యదర్శి మహేందర్‌పై కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా మండలంలోని గోపన్‌పేట, నర్సింగాపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. నర్సింగాపురంలో ఇటీవల ఐదుగురికి డెంగీ పాజిటివ్ నిర్ధారణ కావడంతో ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. చిన్న గ్రామంలో అయిదు కేసులు నమోదు కావడం ఏంటని వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. రెండు రోజుల్లో గ్రామం అంతటా ఫాగింగ్ చేయాలని, నిత్యం మండల అధికారులు గ్రామంలో పర్యటించి డెంగీ కేసులు పెరగకుండా చూడాలని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో పేషెంట్ల వివరాలను తెలుసుకున్నారు. రక్త పరీక్షలు ఏలా చేస్తున్నారని ల్యాబ్ టెక్నీషియన్‌ను అడిగి తన రక్తం నమూనా ఇచ్చి సీబీపీ ఇతర పరీక్షలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు సాయినాథ్‌రెడ్డి, పరిమళ, మండల స్పెషల్ ఆఫీసర్‌లు నరేష్, మల్లికార్జున్, తహసీల్దార్ అబ్రహాం లింకన్, ఎంపీడీవో ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

కొత్తకోటలో..

కొత్తకోట : మునిసిపల్, పంచాయతీ అధికారులు ప్రతీ శుక్రవారం నిర్వహించే డ్రై డే కార్యక్రమం వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టేటట్లు ఉండాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం కొత్తకోట 4, 11వ వార్డులతో పాటు నాటవెల్లి, మిరాసిపల్లి గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించారు. అనంతరం మునిసిపల్ అధికారులతో మాట్లాడుతూ వార్డుల్లో అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. దోమల సంతతి పెరగకుండ ఫాగింగ్ చేయించాలన్నారు. కలెక్టర్ వెంట మునిసిపల్ ప్రత్యేక అధికారి స్వరన్ సింగ్, వైద్యాధికారులు సాయినాథ్‌రెడ్డి, ప్రవళిక, మునిసిపల్ కమిషనరు సూర్య కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో రవీంద్రబాబు ఉన్నారు.

సర్వే త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : ఇంటింటి సర్వే త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలతో కలెక్టరేట్ నుంచి వీసీ ద్వారా స్పెషల్ సమ్మరీ రివిజన్, దోమల నివారణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఇంటింటి సర్వేలో వనపర్తి జిల్లా చాలా వెనుకబడి ఉందని, సర్వేలో వేగం పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. పంచాయతీ సెక్రటరీల వద్ద లభించే డేత్ సర్టిఫికెట్ ఆధారంగా మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ వద్ద పెన్షన్ పొందే దివ్యాంగుల జాబితా సేకరించి వారిని పీడబ్ల్యూడీ జాబితాలో చేర్పించాలని సూచించారు. రెండు రోజుల్లో సర్వే 30 శాతం పూర్తి కావాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా పోలింగ్ స్టేషన్‌ల మార్పు చేర్పులు ఉంటే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డెంగీ నివారణపై సమీక్ష నిర్వహిస్తు ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పించాలని తెలిపారు. డెంగీ పాజిటివ్ వచ్చిన ఇంటి పరిసరాలను ప్రతీ రోజు శుభ్రం చేయించడం, ఫాగింగ్ చేయించడం వంటివి జరగాలని ఆదేశించారు. కొత్త కేసులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేష్, ఆర్డీవో పద్మావతి, డీపీవో రమణమూర్తి, జడ్పీ సీఈవో యాదగిరి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఉమాదేవి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి జయచంద్ర మోహన్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలో సామర్థ్యాలు పెంపొందించాలి

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

పెద్దమందడి, ఆగస్టు 30: విద్యార్థులలో కనీస సామర్థ్యాలు పెంపొందించే విధంగా విద్యా బోధన ఉండాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. శుక్రవారం ఆయన కేజీబీవీ విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో చదవడం, రాయడం, సామర్థ్యం పెంపొందించాలని సూచించారు. ప్రభుత్వం మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పరిశుభ్రమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాల, పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట జీసీడీవో శుభలక్ష్మి, కేజీబీవీ విద్యాలయ ప్రత్యేక అధికారి, పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.



కూరగాయలను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

'కార్మికుల ఇన్సూరెన్స్ ఎల్ఐసీకి అప్పజెప్పొద్దు'

ఆత్మకూరు, ఆగస్టు 30: భవన నిర్మాణ కార్మికుల ఇన్సూరెన్స్‌ను ఎల్ఐసీ సంస్థకు అప్పజెప్పొద్దని ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం జూరాల గ్రామంలో కార్మికులను కలిసి వారితో మాట్లాడారు. కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా నిర్మాణ రంగ బోర్డు ఏర్పడి కార్మికులకు అనేక సంక్షేమ పథకా లు అమలవుతున్నాయని అన్నారు. బీమా స్కీమును ఎల్ఐసీ కంపెనీకు అప్పగిస్తే ఇబ్బందులు వస్తాయని తెలిపారు.

మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలి

- రుణాలను సకాలంలో చెల్లించాలి

- డీఆర్‌డీవో ఉమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి

పానగల్, ఆగస్టు 30: ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న మహిళా శక్తి పథకాన్ని మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో ఉమాదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించిన కార్య నిర్వహణ కమిటీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు మహిళా శక్తి పథకం చేపడతున్న 16 రకాల ఉపాధి సంక్షేమ పథకాలను వివరించారు. అదే విధంగా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. ఆడ పిల్లలను పురుషులతో సమానంగా చదివించి ఉన్నతంగా ఎదిగేలా ప్రోత్సాహించాలన్నారు. ఆడ మగ తేడా లేకుండా సమానంగా చూడాలన్నారు. అదే విధంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిక్కేపల్లి, కదిరేపాడు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రతీ ఒక్కరు తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వారానికి ఒకసారి నిల్వ నీరు పారబోసి కొత్త నీటిని పట్టుకోవాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదే విధంగా రేమద్దుల గ్రామంలో మండల ప్రాథమిక వైద్యాధికారి చంద్రశేఖర్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోవిందరావు, ఎంపీవో రఘురాం, డీపీఎంలు భాషా నాయక్, అరుణ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

వనపర్తి రూరల్, ఆగస్టు 30: వనపర్తి పట్టణంలోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరంలో మిగిలిపోయిన సీట్లకు సెప్టెంబరు 2న జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ కూకట్‌పల్లి హైదరాబాద్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అడ్మిషన్లు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని, అర్హులైన ప్రతీ ఒక్క విద్యార్థి సభ్యులు చేసుకోవాలని అన్నారు.

డ్రైవర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి వైద్యవిభాగం, ఆగస్టు 30: జిల్లాలోని వెటర్నరీ వాహనం (1962) ఈఎంఆర్ఐ సంస్థలో డ్రైవర్‌గా విధులు నిర్వహించడానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని 1962 ఈఎంఆర్ సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ మహబూబ్ మియా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు శనివారం జిల్లా జనరల్ ఆస్పత్రిలోని 108 కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. డ్రైవర్‌గా (పైలెట్) విధులు నిర్వహించడానికి అభ్యర్థులు 10వ తరగతి పాస్ అయి ఉండాలని, 23 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు ఉండాలన్నారు. ఎల్ఎంవీ బ్యాడ్జ్ తప్పకుండా కలిగి ఉండాలన్నారు.

యువతను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాలు

- డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు రాజశేఖర్

వనపర్తి టౌన్, ఆగస్టు 30: దేశంలోని యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు రాజశేఖర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. నిరుద్యోగ భృతి ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అంతేకాకుండా యువతకు ఎలాంటి షరతులు లేకుండా స్వయం ఉపాధి కల్పన కోసం రూ. 10 లక్షల రుణాలు ఇవ్వాలన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు మహేష్, ఖాజా, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్తక వ్యాపార సంఘం కార్యవర్గం ఎన్నిక

అమరచింత, ఆగస్టు 30: అమరచింత పట్టణంలోని వర్తక వ్యాపార సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఆ సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని మార్కండేయ ఆలయ ఆవరణలో జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా ఈశ్వర శెట్టి, నూతన అధ్యక్షుడిగా తాటికొండ విజయ్, ప్రధాన కార్యదర్శిగా తోకలి రమేష్, ఉపాధ్యక్షులుగా నరసింహులు గౌడ్, షంషీర్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు తాటికొండ విజయ్ మాట్లాడుతూ... వ్యాపార సంఘం అభివృద్ధితో పాటు సామాజిక కార్యక్రమాల్లో తమ వ్యాపారులు ముందుంటున్నారని అన్నారు.

సంత్ సేవాలాల్ భవన నిర్మాణం చేపట్టాలి

ఖిల్లాఘణపురం, ఆగస్టు 30: సంత్ సేవాలాల్ భవనాన్ని నిర్మించాలని శుక్రవారం గిరిజన నాయకులు సభావత్ హర్య నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలో గిరిజనులు అధికంగా ఉన్నారని, గిరిజనుల ఆరాధ్య దైవాన్ని స్మరించేలా ప్రతీ తండాలో సేవాలాల్ భవనాలను నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయిచరణ్ రెడ్డి, నాను నాయక్, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీని బలోపేతం చేద్దాం'

గోపాల్‌పేట, ఆగస్టు 30: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కూమరస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరై పలు సూచనలు చేశారు. ప్రతీ బూత్‌లో 800 మందికి తగ్గకుండా సభ్యత్వం చేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు మాధవరెడి ఉన్నారు.

అమరచింతలో..

అమరచింత : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రూరల్ అధ్యక్షుడు హరీశ్ సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రణాళిక ప్రకారంగా సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని సూచించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నిల్వనీటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో



వీధులను శుభ్రపరుస్తూ అవగాహన కల్పిస్తున్న మునిసిపల్ సిబ్బంది

వీపనగండ్ల, ఆగస్టు 30: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసరావు, డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. డ్రైడే సందర్భంగా సంగినేనిపల్లిలో శుక్రవారం వారు పర్యటించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, మురుగు నీటిలో దోమలు వ్యాప్తి చెందుతాయని, దోమల వల్లనే విష జ్వరాలు వస్తాయని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమరచింతలో..

అమరచింత: పారిశుధ్యంపై మునిసిపల్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ప్రత్యేక అధికారి లక్ష్మప్ప పేర్కొన్నారు. శుక్రవారం ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఏడో వార్డులో మునిసిపల్ చైర్ పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కమిషనర్ నూరుల్ నజీబ్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలువలు శుభ్రపరిచి, చెత్తా చెదారాన్ని తొలగించి నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, వైద్యులు, మునిసిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : దోమల నివారణతోనే సీజనల్ వ్యాధులు ధరి చేరవని ఆత్మకూరు మునిసిపల్ చైర్ పర్సన్ గాయత్రి అన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని ఆరో వార్డులో వైస్ చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, మునిసిపల్ కౌన్సిలర్ యాదమ్మతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్న కారణంగా ఇంటి పరిసరాలు చుట్టు వర్షపు నీరు నిలిచి దోమలు ఈగలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. కావునా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ ప్రత్యేక అధికారి డాక్టర్ శ్రీనివాస్, ఆరోగ్య మిత్ర సురేందర్ గౌడ్, ఆర్‌పిలు ఆశ కార్యకర్తలు మునిసిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు కొనసాగించాలి



మునిసిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కరుణశ్రీ

పెబ్బేరురూరల్, ఆగస్టు 30: గత ప్రభుత్వ హయంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మంజూరు చేసిన అభివృద్ధి పనులు నిలిచిపోయాయని మునిసిపల్ చైర్ పర్సన్ కరుణశ్రీ అన్నారు. పెబ్బేరు మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో చౌడమ్మ గుడి నుంచి జమ్ములమ్మ గుడి వరకు బీటీ రోడ్డు వేశారని, ఇంకా కొంత పని మిగిలిపోయావని అన్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు కొనసాగించాలని ఆమె కోరారు. వనపర్తి రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి పెబ్బేరు పట్టణంలో ఉన్న ప్రభుత్వ భూమిలో ప్లాట్లు కేటాయించి వారికి ఇందిరమ్మ ఇంటి పథకంలో నిధులు మంజూరు చేయాలన్నారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్లు పార్వతి, గోపి బాబు, పట్టణ నాయకులు ఎద్దుల సాయినాథ్, వేణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలి

పెబ్బేరు రూరల్ : వనపర్తి, పెబ్బేరు రోడ్డు విస్తరణలో ఇళ్లు, ఇంటి స్థలాలను కోల్పోయిన బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని శుక్రవారం బాధితులు మునిసిపల్ చైర్మన్‌కు, కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. ఇప్పటికే నిర్మించిన డబుల్‌బెడ్‌రూంలు తమకు వద్దని, పెబ్బేరు పట్టణంలో ప్రభుత్వ స్థలంలో ప్లాట్ కేటాయించి రూ.5 లక్షలు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని చైర్మన్, కమిషనర్ హామీ ఇచ్చారు.

బస్సు సౌకర్యం కల్పించాలి : సీపీఎం

వీపనగండ్ల, ఆగస్టు 30: మండలంలోని గోపాల్‌దిన్నె గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం గోవర్ధనగిరి మెయిన్ రోడ్డుపై రాస్తారోకో చేశారు. కరోనా సమయం నుంచి గోపాల్‌దిన్నె, వీపనగండ్ల, కొల్లాపూర్ రూటులో బస్సులు నడపటం లేదని సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు మహబూబ్‌పాషా అన్నారు. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వెళ్లాలన్నా ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా ఆరు కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి ఉందదన్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నిరంజన్, ఖాజాహుస్సేన్, రవిప్రసాద్, కిరణ్, అహ్మద్, శ్రీనివాసులు, వెంకటస్వామి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.